క్లుప్తంగా

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి

పాన్‌గల్: మండలంలోని మాందాపూర్ గ్రామానికి చెందిన గోవర్ధన్‌సాగర్ గురువారం జిల్లా కేంద్రంలోని ఆర్‌జీ గార్డెన్‌లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న సందర్భంగా మండల కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కాంగ్రెస్ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

యాదవులకు గుర్తింపు



కొత్తకోట: మహబూబ్‌నగర్ అర్బన్, రూరల్ డెవలప్‌మెంట్ చైర్మన్‌గా నియమితులైన లక్ష్మయ్యయాదవ్‌ను కొత్తకోట యాదవ సంఘం సభ్యులు బుధవారం మహబూబ్‌నగర్‌లో కలిసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. యాదవులను గుర్తించి నామినేటెడ్ పదవులు ఇస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యేలు జి.మధుసూదన్‌రెడ్డి, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి కి యాదవులు రుణపడి ఉంటామని, కాంగ్రెస్ పార్టీకి యాదవులు ఎప్పుడు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కదిరె సాయిలుయాదవ్, పెంటన్నయాదవ్, శంకర్‌యాదవ్, రాములుయాదవ్, రాజుయాదవ్ ఉన్నారు.

ఎంఈఓకు సన్మానం



మదనాపురం: మండల విద్యాశాఖ అధికారిగా షేక్ ఫారూక్ హుస్సేన్ బాధ్యతలు చేపట్టడంతో బుధవారం కాంగ్రెస్ నాయకులు ఎమ్మార్సీ భవనంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అబ్దుల్ రావూఫ్, టీపీసీసీ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ అంజాద్‌అలీ, గుండ్రాతి సురేందర్‌గౌడ్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలికి..



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లికి చెందిన లక్ష్మి ఇటీవల వెలువడిన డీఎస్సీ ఫలితాల్లో జిల్లా టాపర్‌గా నిలిచి ఎస్‌జీటీలో ఉద్యోగం సాధించింది. బుధవారం స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మి దంపతులను పూలమాల, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నరోత్తంరెడ్డి, నక్కల శాంతన్న, హోటల్ రాజు, వడ్డె నాగరాజు, వెంకట్‌కుమార్, నర్సింహ్మా, మొగులయ్య, భాస్కర్‌చారి, ధనుష్, డీకే లక్ష్మణ్, బాబు ఉన్నారు.

పీఆర్టీయూ ఆధ్వర్యంలో..



వనపర్తి రూరల్: పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలో విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులకు ఉమ్మడి మండల పీఆర్టీయూ టీఎస్ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాములు మాట్లాడుతూ నూతనంగా ఎంపికైన ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేసి విద్యార్థుల ఉన్నత భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. కార్యక్రమంలో శ్రీరంగాపురం ఎంఈఓ హనుమంతు, హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దయానంద్, జయంత్‌రెడ్డి, ఉమ్మడి మండల పీఆర్టీయూ అధ్యక్షుడు చిన్నరాములు, వసంతపురం రాజు, ప్రధాన కార్యదర్శి నాయిని విష్ణువర్ధన్ నాయుడు, దుర్గాప్రసాద్‌యాదవ్, దామోదర్‌బాబు, కృష్ణమూర్తి, నాగేంద్రం గౌడ్, రవీందర్‌రెడ్డి, మోహన్‌రాజు, అరుంధతి, నరసమ్మ, లోకేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

కొత్తకోట రూరల్: మండలంలోని సత్యహళ్లి, వడ్డెవాట గ్రామాల మధ్యగల రోడ్డు గుంతలమయంగా ఉండడంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఎన్నికల సమయంలో ప్రచారంలో భాగంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి తాను గెలిచిన వెంటనే సత్యహళ్లి గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయిస్తానని మాటిచ్చాడు. ఇచ్చిన మాట ప్రకారం రెండు గ్రామాల మధ్యలో బీటీ రోడ్డు వేసేందుకు రూ.1.50కోట్లు నిధులు మంజూరు చేయించారు. ఎన్నో ఏళ్లుగా రెండు గ్రామాల మధ్య రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న ఇరు గ్రామాల ప్రజలు నిధుల మంజూరుపై హర్షం వ్యక్తం చేశారు. నిధులు మంజూరు కావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చర్లపల్లి మాజీ సర్పంచ్ శేఖర్‌రెడ్డికి ఇరు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీపాండురంగస్వామి మూలవిరాట్



స్వామివారి విగ్రహాలు, ఆభరణాల ఊరేగింపులో భక్తులు



శ్రీపాండురంగస్వామి, రుక్మిణిమాత కల్యాణం

- భక్తిశ్రద్ధలతో కల్యాణం, పల్లకీసేవ

ఆత్మకూర్: మండలంలోని మూలమళ్ల గ్రామంలో శ్రీపాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రముఖ వేదపండితుడు శ్రీధర్‌జ్యోషి ఆధ్వర్యంలో శ్రీపాండురంగస్వామి, రుక్మిణీమాత కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అలాగే స్వామివారి అలంకరణ ఆభరణాలు ఊరేగింపు, పల్లకీసేవా ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో భజన మండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. అలాగే గురువారం శ్రీపాండురంగస్వామివారి రథోత్సవం, మహామంగళహారతి, ప్రసాద వితరణ ఇతర పూజలు చేపడుతున్నామని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు యుగంధర్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వినయ్‌కుమార్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఆనంద్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, భీమన్న, రాజశేఖర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ఇఫ్టూ సభను జయప్రదం చేయండి

ఆత్మకూర్: కార్మికుల హక్కులను పాలకులు కాలరాస్తున్నారని, కార్మికులందరూ హక్కుల సాధన కోసం ఏకమై ఉద్యమించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన వర్కర్లతో కలిసి ఐఎఫ్‌టీయూ కార్మికసంఘం టీయూసీఐలో విలీన సభ పోస్టర్లను విడుదల చేశారు. హక్కుల సాధన కోసం కార్మిక సంఘాలు ఏకమై ఒక్కటిగా మారేందుకు ఈనెల 20వ తేదీన హైదరాబాద్‌లో జరిగే విలీనసభకు కార్మికులు వేలాదిగా తరలిరావాలని పిలుపునిచ్చారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న ఇఫ్టూ నాయకులు

కార్యక్రమంలో హేమలత, భారతమ్మ, నాగలక్ష్మి, లక్ష్మీదేవమ్మ, బాలీశ్వరమ్మ పాల్గొన్నారు.

కాలేజీ రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లే దారి ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా మారిందని, మరమ్మతు చేపట్టాలని కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు కోరుతున్నారు. కోతకు గురైన దారిలో వాహనాలు వెళ్లాలన్నా, నడవడానికి కూడా ఇబ్బందిగా మారిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి దారికి మరమ్మతు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కళాశాల అధ్యాపక బృందం, విద్యార్థులు కోరుతున్నారు.



లక్ష్మీనారాయణకు ఘన నివాళి

వనపర్తి రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ ఎస్ లక్ష్మీనారాయణ వర్ధంతిని బుధవారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనపర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్‌యాదవ్, పలువురు కాంగ్రెస్ నాయకులు, గ్రామ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాములుయాదవ్, డీసీసీ మాజీ అధ్యక్షుడు తైలం శంకర్‌ప్రసాద్, తిరుపతయ్య, రామిరెడ్డి, ప్రభాకర్‌గౌడ్, రాములు, రామ్‌చందర్, మద్దిలేటి, సోప్పరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

వనపర్తిటౌన్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ అర్జున్ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల కాకపోవడంతో రూ.7,500 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని విడుదల చేసి విద్యా రంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కావస్తున్నా విద్యా వ్యవస్థకు ఊరటనిచ్చే ఏ నిర్ణయం తీసుకోలేదని మండిపడ్డారు. నిరుపేదలకు చదువును దూరం చేసే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు.

అదుపుతప్పి కంటైనర్ బోల్తా

కొత్తకోట రూరల్: కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మంగళవారం రాత్రి కొత్తకోట బైపాస్‌లోని ఛత్రపతి విగ్రహం సమీపంలో చోటు చేసుకుంది. డ్రైవర్ రాఘవేంద్ర తెలిపిన వివరాల మేరకు బెంగుళూర్ నుంచి పార్సిల్ లోడ్‌తో హైదరాబాద్ వెళ్తుంది. కంటైనర్ రాత్రి 11గంటల సమయంలో కొత్తకోట సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడుపుతూ సైడ్ ఇచ్చినట్లే ఇచ్చి.. కంటైనర్‌కు అడ్డం రావడంతో డ్రైవర్ అదుపు చేసే క్రమంలో రోడ్డు కిందకు దూసుకెళ్లింది. దీంతో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. బుధవారం ఉదయం ఘటన స్థలానికి చేరుకున్న హైవే సిబ్బంది రోడ్డు కింద పడిన కంటైనర్‌ను క్రేన్ సహాయంతో బయటకు తీశారు.

చట్టాలపై అవగాహన తప్పనిసరి

వనపర్తి రూరల్: జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని నాగవరంలోని మహాత్మా జ్యోతిబాపూలే, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లీగల్ అండ్ డిఫెన్స్ కౌన్సిల్ జి ఉత్తరయ్య వినియోగదారుల చట్టాలు, తూనికలు కొలతల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి వస్తువు కొనేటప్పుడు ఆ వస్తువు యొక్క రేటు, గడువు తేదీ, నాణ్యత పరిశీలించాలన్నారు. అక్కడ ముద్రించిన రేటు కన్నా ఎక్కువ అమ్మినచో టోల్‌ఫ్రీ నంబరు గాని సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మోటారు వాహనాల చట్టాల గురించి వివరించారు. 18 ఏళ్ల లోపు పిల్లలు వాహనాలు నడవపడం, త్రిబుల్ రైడింగ్ చేయరాదని, హెల్మెంట్ ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని సూచించారు. కార్యక్రమంలో లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ ఎం శ్రీదేవి, ఎం లక్ష్మి, శోభారాణి, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉత్తరయ్య

విద్యా ప్రమాణాలు పెంచాలి



ఎంఈఓకు రిపోర్టు అందజేస్తున్న నూతన ఉపాధ్యాయులు

పాన్‌గల్: డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో జిల్లా విద్యాశాఖ ద్వారా మండలానికి ఇద్దరు నూతన ఉపాధ్యాయులను కేటాయించినట్లు ఎంఈఓ శ్రీనివాసులు తెలిపారు. మండలానికి కేటాయించిన ఇద్దరు ఉపాధ్యాయులు బుధవారం మండల ఎంఈఓ కార్యాలయంలో రిపోర్టు చేశారని పేర్కొన్నారు. మండలానికి వచ్చిన ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులు పరమేశ్వరి యూపీఎస్ దావాజిపల్లి, నాగమణి పీఎస్ తెల్లరాళ్లపల్లితండా (డీఎస్‌టీ)లో విధుల్లో చేరినట్లు ఎంఈఓ తెలిపారు. నూతనంగా మండలంలో చేరిన ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేయాలని ఎంఈఓ వారికి సూచించారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

వీపనగండ్ల మండలంలో 15 మంది ఉపాధ్యాయులు చేరిక..

వీపనగండ్ల: డీఎస్సీ ఫలితాల్లో ఉద్యోగం సాధించిన 15 మంది ఉపాధ్యాయులు బుధవారం మండలంలోని వివిధ గ్రామాల్లోని పాఠశాలలో చేరినట్లు మండల విద్యాధికారి నర్సింహ తెలిపారు. గతంలో ప్రాథమిక పాఠశాలల నుంచి 13 మంది ఎస్జీటీ టీచర్లు బదిలీలపై ఇతర ప్రాంతాలకు వెళ్లగా.. నూతనంగా 10 మంది ఎస్జీటీ టీచర్లు ఉద్యోగాల్లో చేరగా.. మరో ఇద్దరు మండలంలోని వేరే గ్రామాల్లో బదిలీలో భాగంగా చేరినట్లు ఆయన తెలిపారు. వీరితోపాటు స్కూల్ అసిస్టెంట్ తెలుగు టీచర్‌లుగా వీపనగండ్ల బాలుర హైస్కూల్, సంపత్‌రావుపల్లి యూపీఎస్ పాఠశాలలో మరో భాషా పండిట్ తెలుగు టీచర్ విధుల్లో చేరారని, హిందీ స్కూల్ అసిస్టెంట్లుగా కల్వరాల, బొల్లారం గ్రామాల్లో ఇద్దరు, వ్యాయామ ఉపాధ్యాయుడిగా మండల కేంద్రంలోని బాయ్స్ ఉన్నత పాఠశాలలో నూతనంగా విధుల్లో చేరారు.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

వనపర్తి రూరల్: ప్రభుత్వం పశువులకు ఉచితంగా అందించే మందులను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం శ్రీరంగాపురం మండలంలోని గ్రామాల్లో పశువైద్య పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో 240 ఆవులు, 320 గేదెలకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ స్వాతి, ఎండీ అబీబ్, లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పట్టణ కేంద్రంలోని 14వ వార్డుకు చెందిన జనంపల్లి జీవన్న (65) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. స్థానిక కాలనీవాసుల ద్వారా సమాచారం తెలుసుకున్న జీఎస్‌ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులు జనంపల్లి జీవన్న ఇంటికి చేరుకుని మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించి, కటుంబ సభ్యులను పరామర్శించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మహిమరాజు, సతీష్‌రాజ్, మేస్త్రీబాబు, విద్యాసాగర్, సన్నయ్య, కొండన్న ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

ఆత్మకూర్: మండలానికి కొత్తగా నియామకం అయిన 10 మంది ఉపాధ్యాయులు బుధవారం వారి వారి పాఠశాలల్లో విధులు నిర్వర్తించారని మండల విద్యాధికారి కొండాపురం బాలరాజు తెలిపారు. వారిలో నలుగురు ఎస్జీటీ ఉపాధ్యాయులు, ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెకు చెందిన మిట్టకడుపుల మహేష్ మంగళవారం రాత్రి ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న మహేష్ దసరాకు సొంత గ్రామానికి వచ్చాడు. తల్లిదండ్రులు నర్సింహ, నర్సమ్మ తరచూ గొడవ పడుతుండటంతో క్షణికావేశానికి లోనై ఒంటిపై పెట్రోల్ పోసుకున్నాడు. వెంటనే కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి.. తర్వాత వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించారు.

ఇంకా ఆరుబయటకే...



చెన్నిపాడులో సామూహిక మరుగుదొడ్డి నిర్మించాల్సిన ప్రదేశం

- పల్లెల్లో అమలు కాని స్వచ్ఛతాహీ సేవ
- ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం
- కొనసాగుతున్న బహిరంగ మల, మూత్రవిసర్జన

మానవపాడు: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు తప్పనిసరి. బహిరంగ మలమూత్ర విసర్జన చేయటంతో పల్లెల్లో అపరిశుభ్రత నెలకొని రోగాలు వచ్చేందుకు ఆస్కారం ఉంటుంది. ఈ సమస్యను పూర్తిగా రూపుమాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి సారించినా క్షేత్ర స్థాయిలో అమలు నోచుకోవడం లేదు. స్వచ్ఛ గ్రామాలుగా మార్చేందుకు మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తున్న చాలా మంది నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో మరుగుదొడ్డు నిర్మించుకోకుంటే రేషన్, పింఛన్, కరెంట్ సరఫరా నిలిపివేస్తామని ప్రచారం చేయటంతో ఎంతో మంది నిర్మాణం చేసుకునేందుకు ముందుకు వచ్చారు.

మండలంలో..

మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 3,005 మరుగుదొడ్లకుగానూ 3,003 మరుగుదొడ్లను ఆయా గ్రామ పంచాయతీల్లో నిర్మించారు. గ్రామాల వారీగా మరుగుదొడ్లు.. అమరవాయి 226, బోరవెల్లి 278, చంద్రశేఖర్‌నగర్ 103, చందూరు 116, చెన్నిపాడు 316, గోకులపాడు 94, జల్లాపురం 431, కలుకుంట్ల 54, కొర్విపాడు 262, మద్దూరు 274, మానవపాడు 455, నారాయణపురం 104, పల్లెపాడు 170, పెద్దఆముదాలపాడు 120, పెద్దపోతులపాడు, చిన్నపోతులపాడు గ్రామాల్లో వీఎస్‌టి పొగాకు కంపెనీ ఆధ్వర్యంలో మరుగుదొడ్లు నిర్మించారు. ప్రతి గ్రామంలో మరుగుదొడ్లను నిర్మించినా.. వాటిని ఉపయోగించడంలో ఆయా గ్రామాల ప్రజలు ఆసక్తి చూపడం లేదు.



చెన్నిపాడులో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్డి

గ్రామస్థాయి అధికారుల నిర్లక్ష్యం

గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడంలో పంచాయతీ కార్యదర్శులు విఫలమవుతున్నారు. గ్రామాల్లో స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంలో బహిరంగ మలమూత్ర విసర్జన ద్వారా ఉత్పన్నమయ్యే సమస్యలు వివరించాలి. కానీ సర్పంచ్‌ల పదవీకాలం పూర్తి కావడంతో.. ప్రభుత్వం నియమించిన ప్రత్యేకాధికారులు ఎప్పుడు గ్రామాలకు వస్తారో తెలియని పరిస్థితి నెలకొంది.

అధికారుల నిర్లక్ష్యం



ప్రతి గ్రామంలో అధికారులు ప్రజలకు అవగాహన కల్పించి మరుగుదొడ్లను నిర్మించారు. వాటిని ప్రజలు వినియోగించుకునేలా చేయడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం చేశారు. బహిరంగ మాల, మూత్రవిసర్జన వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలి.

– మద్దిలేటి, చెన్నిపాడు

రోగాల బారిన పడే ప్రమాదం



బహిరంగ మల, మూత్ర విసర్జన కారణంగా పారిశుద్ధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. దీనిపై అధికారులు నిరంతరం గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యానికి గండి పడుతోంది. రూ.వేలు వెచ్చించి నిర్మించిన మరుగుదొడ్లు వృథాగా పడి ఉన్నాయి.

– సుధాకర్, చిన్నపోతులపాడు

అవగాహన కల్పిస్తాం

ప్రతి కుటుంబానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. మండలంలో మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకుంటాం. బహిరంగ మలవిసర్జన చేయడం ద్వారా కలిగే అనర్థాల గురించి వివరిస్తాం. మరుగుదొడ్డి నిర్మించుకోని కుటుంబానికి ప్రభుత్వ పథకాలు నిలిపివేసే విధంగా చర్యలు తీసుకుంటాం.

– భాస్కర్, ఎంపీడీఓ, మానవపాడు

21 నుంచి దేవేంద్రాచార్య ఆరాధనోత్సవాలు

అమరచింత: మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో వెలసిన దేవేంద్రాచార్య మహాస్వాముల 72వ అరాధన ఉత్సవాలు ఈనెల 21 నుంచి 23 వరకు కొనసాగుతున్నాయని మఠ నిర్వాహకుడు నరసింహాచార్యులు తెలిపారు. దేవేంద్రాచార్య ఆరాధన ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మఠంలో బుధవారం విడుదల చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దేవేంద్రాచార్యులు గ్రామంలో శ్రీరామాచార్య, చంద్రాంబ దంపతులకు నాల్గో నెల 15 తేదీ 1885వ సంవత్సరంలో జన్మించారన్నారు. దేవేంద్రాచార్యులు చిన్న వయస్సులోనే తపోశక్తిని సాధించి ఎన్నో మహిమలను చూపుతూ ఇక్కడి ప్రజలకు ఆరాధ్యుడిగా మారారన్నారు. ఆరాధనోత్సవాలకు గాయత్రి పీఠాధీశ్వరుడు జగద్గురు శ్రీకాంతేంద్ర స్వామి, శ్రీకాళికాంబ ఉపాసకులు గుండెపల్లి నరేష్ ఆచార్యులు పాల్గొంటారన్నారు. ఉత్సవాల్లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చేతుల మీదుగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నరసింహులు గౌడ్, వెంకటేష్ ఆచారి, కల్వ నరసింహులు, నవీన్‌కుమార్, నందకుమార్ ఆచారి, కల్వ వీరేష్, వెంకట్రాంరెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న గ్రామస్తులు

మా ఆఫీస్.. మా ఇష్టం



కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలో మధ్యాహ్నం 12గంటలు దాటినా ఖాళీ కుర్చీలు దర్శనం



12గంటలకు ఖాళీగా ఉన్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కుర్చీ

- ఎంపీడీఓ కార్యాలయంలో సమయపాలన పాటించని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కొత్తకోట రూరల్: స్థానిక మండల పరిషత్ ఇన్‌చార్జ్ అధికారితో పాటు ఇతర సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఉద్యోగులు తీరుపై విమర్శలు వస్తున్నాయి. 'మా ఆఫీస్.. మా ఇష్టం నచ్చిన సమయానికి మేము వెళ్తాం మమ్మల్ని ఎవరేం చేయలేరు' అన్న చందంగా మారింది కొత్తకోట ఎంపీడీఓ కార్యాలయంలోని ఉద్యోగుల తీరు. ఉద్యోగులు, ఎంపీడీఓ మధ్యాహ్న 12గంటలు అవుతున్నా.. కార్యాలయానికి రాకపోవడంతో వివిధ పనుల కోసం ప్రజలు అసహనానికి లోనవుతున్నారు. ఖాళీ కుర్చీలు దర్శనం ఇవ్వడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఎంపీడీఓకు ఫోన్ చేస్తే నేను ఫీల్డ్‌పై ఉన్న, మీటింగ్‌లో ఉన్న అని ప్రతిసారి ఇలానే చెప్తున్నారని ప్రజలు విసుగు చెందుతున్నారు. మహాలక్ష్మి, గృహజ్యోతి కోసం దరఖాస్తులు ఇచ్చిన లబ్ధిదారులకు సమస్యలు తలెత్తడంతో నేటికీ రూ.500సిలిండర్ అందడం లేదని, సమస్య తెలుసుకునేందుకు ఉదయం 10గంటలకు కార్యాలయానికి వచ్చిన ప్రజలకు కార్యాలయంలో ఏ ఒక్క అధికారి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్యాలయంలో మహాలక్ష్మి, గృహజ్యోతి వివరాలను చూసే అధికారి ప్రతిరోజు 11గంటల తర్వాతే కార్యాలయానికి వస్తున్నారని, అతడి దగ్గరకు వెళ్లి తమకు ప్రభుత్వ పథకాలు వర్తిండం లేదని అడిగితే చీదరించుకుంటున్నారని మండిపడ్డారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జ్ ఎంపీడీఓకు చెప్పినా సదరు ఉద్యోగి తీరు మారడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.